
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

శనివారం 1 ఫిబ్రవరి 2025

కేంద్రం కరుణించేనా?

నేటి నిర్మలమ్మ పద్దుపై ఓరుగల్లు వాసుల ఆశలు

ఓరుగల్లులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, లెదర్ పార్కు సైనిక్ స్కూల్ ఏర్పాటు.. కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీ, కొత్తరైల్వేలైన్ల నిర్మాణం.. ఇవే కాదు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీతో పాటు మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పన లాంటి వాటి కోసం ఉమ్మడిజిల్లా వాసులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. ఏటా కేంద్రం కరుణిస్తుందని.. బడ్జెట్‌లో కేటాయింపులు చేసి తమ కలలను సాకారం చేస్తుందని ఆశిస్తున్నారు. కానీ ఎప్పుడూ నిరాశే మిగులుతోంది. అయితే ఈ సారి పలు పథకాలు, అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మోదీ సర్కారును కోరిన నేపథ్యంలో ఎంతోకొంత మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందరూ శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై ఓరుగల్లు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో పలు పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనుల పూర్తికి అవసరమైన నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడం, ఆ ప్రతిపాదనల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాల అంచనాలను అందించడం లాంటి పరిణామాలతో ఈ సారి కేంద్రం కరుణించి.. బడ్జెట్‌లో ఓరుగల్లుకు కేటాయింపులు జరుపుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించిన వాటిలో వరంగల్ నగరంలో చేపట్టనున్న భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, లెదర్ పార్కు, సైనిక్ స్కూల్‌తో పాటు కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా, కోచ్ ఫ్యాక్టరీ, కొత్త రైల్వే లైన్లకు కేంద్ర బడ్జెట్‌లో చోటు లభిస్తుందనే ఆశతో ఓరుగల్లువాసులు ఉన్నారు. వీటితో పాటు విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీతో పాటు మేడారం మహాజాతరకు జాతీయ హోదాపై కేంద్రం తేల్చుతుందనే ఆశతో ఉన్నారు. శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి ఓరుగల్లును కరుణిస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

కేఎంటీపీకి పీఎం మిత్రలో చోటు దక్కేనా?

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)కు పీఎం మిత్ర పథకంలో చోటివ్వడంతో పాటు గ్రీన్ ఫీల్డ్ హోదా ఇవ్వాలని, అంతేకాకుండా రూ.300కోట్ల గ్రాంటు కూడా విడుదల చేయాలని

మిగతా 7వ పేజీలో...

భూగర్భ డ్రెయినేజీకి నిధుల కోసం..

వరంగల్ నగరంలో 10లక్షలకు పైగా జనాభా, 1,500లకు పైగా కాలనీలున్నాయి. కానీ నగరంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో లోతట్టు ప్రాంతలు ఏటా నీట మునిగిపోవాల్సిందే. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీళ్ల బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో వానాకాలం కష్టాలు తప్పటం లేదు. అయితే ఈ కష్టాలకు కాస్తంత ఊరటనిచ్చేదిగా పేర్కొన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను త్వరిత గతిన నిర్మించాలన్న డిమాండ్ ప్రజల్లో డిమాండ్ ఉంది. దీంతో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ మహానగరంలో భూగర్భ డ్రెయినేజీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నవంబరు 19వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా భూగర్భ డ్రెయినేజీకి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రూ.4,170కోట్ల నిధులతో వరంగల్ నగరంలో మూడు విడతల్లో భూగర్భ డ్రెయినేజీని పూర్తి చేస్తామని ప్రకటించింది. అయితే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. బడ్జెట్‌లో కేంద్ర కరుణిస్తుందా అనే ఉత్కంఠ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది.

- పలు అభివృద్ధి పనులకు ఇకనైనా మోక్షం కలిగేనా?
- వివిధ పథకాల నిర్వహణకు కేంద్ర నిధుల కోసం ప్రభుత్వం లేఖ
- నగరంలో భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లు కోరిన రాష్ట్రం
- టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్రలో చేర్చి.. రూ.300కోట్ల గ్రాంటు ఇవ్వాలని విజ్ఞప్తి
- లెదర్ పార్కు, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ఎదురుచూపులు
- కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీకి నిధులొచ్చేనా?
- కాజీపేట- భూపాలపల్లితో పాటు మూడు కొత్త రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా?
- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలాసీతారామన్

ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు

- పన్నులు ఎగవేవస్తున్న నిర్వాహకులు!
- మునిసిపల్ ఆదాయానికి గండి

భూపాలపల్లిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలో భారీ హోర్డింగులలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏడాది మునిసిపాలిటీకి పన్ను కట్టాల్సి ఉండగా కొందరు మాత్రమే చెల్లిస్తూ మిగతా వారు ఎగ్గొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇవి తమ సొంతంగా వేసుకున్న హోర్డింగులని, వాటికి పన్ను చెల్లించాల్సి అవసరం ఏముందని వితండవాదం చేస్తున్నట్టు తెలుస్తోంది. భూపాలపల్లిలో ప్రైవేట్ హోర్డింగ్‌లు సుమారు 12 ఉన్నాయి. వీటిలో ఏడికి మాత్రమే రూ. 90 లక్షల ఆదాయం మునిసిపాలిటీకి వస్తుందని అధికారులు తెలిపారు. మిగతా ఐదు హోర్డింగులకు పన్నులు చెల్లించడం లేదని తెలుస్తోంది. వీటిలో కొన్ని వివిధ పార్టీలకు చెందినవి ఉన్నాయని సమాచారం. వీటికి పన్నులు చెల్లించకపోవడంతో లక్షలాది రూపాయల ఆదాయం మునిసిపాలటీకి గండి పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతోపాటు హోర్డింగులను తమ ఇష్టానుసారంగా ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేస్తున్నారని తెలుస్తోంది. వాటికి అనుమతులు తీసుకోలేదని సమాచారం. ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారోననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కుందూరుపల్లిలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెల్‌కం హోర్డింగ్‌ను ఓ పార్టీ బ్యానర్లతో నింపడం విస్మయానికి గురిచేస్తోంది. ఎలక్షన్ కోడ్ వచ్చినప్పటికీ పార్టీ బ్యానర్లను తొలగించకపోవడం పట్ల పలు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



భూపాలపల్లి పట్టణంలో భవనంపై ఏర్పాటు చేసిన ఓ హోర్డింగ్

మంత్రి శ్రీధర్‌బాబుకు స్వగ్రామంలో ఘన స్వాగతం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనన ముగించుకొని తొలిసారిగా స్వగ్రామానికి శుక్రవారం చేరుకున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు భూపాలపల్లి జిల్లా కాటారం మంలం ధన్వాడలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రానికి సుమారు 1.78 లక్షల కోట్ల నిధులు రాబట్టేలా పలు అంతర్జాతీయ, జాతీయ కంపెనీలతో ఎంఓయూ చేసుకుని వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, నాయకులు పంతకాని సమ్మయ్య, రమేష్‌రెడ్డి, ఆత్మకూరి కుమార్, రవీందర్‌రావు, భూపెల్లి రాజు, గడ్డం కొమురయ్య, బీరెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాటారంలో పలువురు యువకులు ఏర్పాటు చేసిన జిమ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

ప్రమాదాలను అరికడదాం

కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించి ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. రాహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీతోపాటు పోలీసు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. వాటిని ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వెళ్లడం, ట్రిబుల్‌రైడ్ వెళ్లడం, ఓవర్‌టేక్ చేయడం వంటివి చేయొద్దని అన్నారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు తప్పక ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్‌తో పాటు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, రవాణా శాఖ అధికారులు

కేటీపీపీ ఉద్యోగుల నిరసన

గణపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను నిరసిస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కాకతీయ థర్మల్ ప్రాజెక్టు (కేటీపీపీ) వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. చండీఘర్, ఉత్తరప్రదేశ్‌లో అవలంబిస్తున్న విధానాలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలువేరు మల్లయ్య, బ్రాంచి కార్యదర్శి ఇనుగాల కుమార్, బ్రాంచి సెక్రటరీ పెరుమాండ్ల కృష్ణమూర్తి, నాయకులు కిరణ్, భూమయ్య, నరసయ్య, రాకేష్, రాజేందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కేటీపీపీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ప్రజల మనిషి గద్దర్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గద్దర్ ప్రజల మనిషని, తన జీవితాన్ని ఆయన బడుగు బలహీన వర్గాలకు కోసం ధారపోశారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గద్దర్ 76వ జయంతి సందర్భంగాకాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తన ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వద్దనుకుని ప్రజల కోసం ఉద్యమించిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. పద్మ అవార్డుకు ఆయన అర్హుడు కాదని కేంద్ర మంత్రి అనడం సిగ్గుచేటన్నారు. ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను మంట గలిపే విధంగా ఉన్నాయని విమర్శించారు. గద్దర్ జయంతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అలాగే ఆయన పేరుతో సినీ ఇండస్ట్రీలో అవార్డులు ఇవ్వడానికి సిద్ధమయ్యారని తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్‌ను విమర్శించే హక్కు బండి సంజయ్‌కు లేదని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, రంజిత్, బిక్షపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం దక్కాలి

జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ సమ్మయ్య

కాటారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కేలా ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో 'హలో బీసీ-చలో వరంగల్ రాజీయ యుద్ధభేరి పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ వరంగల్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే సభకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, బీసీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, చేతి కులవృత్తులను పరిశ్రమలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పేద బీసీలకు ప్రభుత్వ భూముల పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటర్నేషనల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల సంపత్, కాటారం డివిజన్ బీసీ సంఘాల నాయకులు దబ్బెట రాజేశం, అండె భాస్కర్, చీమల రాజు, కొట్టె సతీష్ ప్రభాకర్, రాజేందర్, శంకర్‌గౌడ్, రాజయ్య, అశోక్, మొగిలి, సమ్మయ్య, వెంకట్రాజం గౌడ్, బాలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు



ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు

వైభవంగా రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవం



రేణుక ఎల్లమ్మ దేవతామూర్తి

మహాముత్తారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో దేవతామూర్తి ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం జరిగింది. పండితుల వేదమంత్రోచ్ఛరణలతో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవాలయంలో ఉప దేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. పూజారులు, గౌడ సంఘం పెద్దలు, గీతకార్మికులు పాల్గొన్నారు.

- మహాముత్తారం (ఆంధ్రజ్యోతి)

సీసీఐ కేంద్రాలకు వెల్లువెత్తిన పత్తి

కాటారం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు జిన్నింగ్ మిల్లులలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలకు శుక్రవారం సైతం పత్తి వెల్లువెత్తింది. పత్తి లోడ్‌తో ఉన్న వాహనాలు బారులు తీరాయి. ఫిబ్రవరి 3 నుంచి సీసీఐ తాత్కాలికంగా కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పూర్తి స్థాయిలో కొనుగోళ్ల ఆగిపోతాయనే భయాందోళనలతో రైతులు వాహనాల్లో పత్తిని లోడ్ చేసుకుని జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి తరలివచ్చారు. రెండు, మూడు రోజులుగా ఇదే తరహాలో పత్తి లోడ్‌తో ఉన్న వాహనాలు మిల్లుల వద్ద రెండు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. బహిరంగ మార్కెట్లోనూ పత్తి ధరలు మద్దతు ధరకు మించి అధికంగా లేకపోవడంతో సీసీఐ కేంద్రాల్లోనే విక్రయాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. సందట్లో సడేమియాలా పలువురు వ్యాపారులు సైతం రైతుల వద్ద తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీఐ కేంద్రాల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతోనే ఫిబ్రవరి 3 నుంచి తాత్కాలికంగా కొనుగోళ్లు జరగవని, జిన్నింగ్ చేసిన తర్వాత యథావిధిగా కొనసాగుతాయని ఏఎంసీ కార్యదర్శి షరీఫ్, సీసీఐ సీపీవో ఇలంగోవన్ తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెదొద్దని స్పష్టం చేశారు.



సీసీఐ కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకోవద్దు

భూపాలపల్లి ఆర్డీవో రవి



గిద్దెముత్తారంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవి

చిట్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను ఎవరూ అడ్డుకోవద్దని, నిర్వాసితుల సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. మండలంలోని గిద్దెముత్తారం శివారులో రహదారి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం కాల్వపల్లి, గిద్దెముత్తారం రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారి పనులకు ఆటంకాలు కల్పించొద్దని కోరారు. భూమి పత్రాలను పరిశీలించి సర్వే నెంబర్లు, నష్టపరిహారంపై చర్చించారు. భూమి కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు
- ఈజీఎస్ క్షేత్ర సిబ్బంది నుంచి రూ.5,37,383 రికవరీకి ఆదేశం



సోషల్ ఆడిట్ నివేదికను జిల్లా అధికారులకు నివేదిస్తున్న డీఆర్పీలు

మరిపెడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ క్షేత్రస్థాయి సిబ్బందిపై ఇక నుంచి కఠిన చర్యలు ఉంటాయని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో రెండో రోజు కొనసాగిన సోషల్ ఆడిట్ ప్రజా నివేదిక ఇన్‌హౌస్ సమావేశంలో భాగంగా సోషల్ ఆడిట్ బృందాలు వివిధ గ్రామాల నివేదికలను అధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడారు. పల్లెల్లోని కూలీలకు 100 రోజులు ఉపాధి కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. దీంట్లో అవినీతికి అస్కారం ఉండొద్దన్నారు. మండల వ్యాప్తంగా గత ఏడాది జరిగిన పనుల్లో రూ.5,37,383 అవినీతి చోటు చేసుకోగా, ఆయన ఆయా గ్రామాల ఎఫ్‌ఏలు, పనులు పర్యవేక్షించిన టీఏల నుంచి ఆ రొక్కం రికవరీ చేయాలని అధికారులను కోరారు. సీలికుర్తి, ఎల్లంపేట ఎఫ్‌ఏలపై విచారణకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కనకదుర్గ, అంబుడ్స్ మేనేజర్ ఆదామ్, ఏపీవో మంగమ్మ, ఎంపీవో సోమ్లా నాయక్, ఎస్ఆర్పీలు చెన్నకేశవులు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభతో బీసీల సత్తా చూపిస్తాం

- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలి
- బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభతో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని, బీసీలమంతా ఏకమయ్యామని, ఇక నుంచి ఓట్లు మావే... సీట్లు మావేనన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆరంభమైన యుద్ధభేరి సభ.. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో విజయభేరిగా మారబోతుందన్నారు. గత 77 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వివక్ష కొనసాగుతుందని, ఇక వారి ఆటలు సాగవనే పరిస్థితికి బీసీలు చేరుకున్నారన్నారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో బీసీల ఐక్యతతో తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. స్థానిక సంస్థలలో మొదలుపెట్టి, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో సైతం 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించాలన్నారు. లేకపోతే బీసీలంతా పూర్తిగా ఏకమైతే మీ పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. బీసీలను తమ బానిసలుగా, సేవకులుగానే చూశారే తప్ప లీడర్లుగా గుర్తించలేదన్నారు. మేం లక్ష మందితో సభ జరపాలనుకున్నామని, కానీ ఆసంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. సభకు అనుగుణంగా పోలీసు అధికారులు సహాయ సహకారాలు అందించాలని, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ సభతో రాష్ట్రంలో బీసీ విప్లవం రాబోతుందని, దేశమంతా ఈ సభ వైపే చూస్తుందన్నారు. రాజకీయ యుద్ధభేరిసభకు ముఖ్య అతిథులుగా డీఎంకే పార్టీ ఎంపీ విల్సన్, ఆర్జేడీ పార్టీ ఎంపీ మిస్సాయాదవ్, ఎస్పీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ హాజరవుతారని, వీరితో పాటు ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, తీన్మార్ మల్లన్న, సినీ నటుడు సుమన్‌లు హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులు రాజకీయాలకతీతంగా హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్సీగా ఆశీర్వదించి గెలిపించండి..

రాబోయే ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటున్నానని, ఉపాధ్యాయులు ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. అటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ, ఇటు ప్రైవేట్ విద్యా వ్యవస్థపై అవగాహన ఉన్న వ్యక్తిగా మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానన్నారు. అనంతరం బీసీ రాజకీయ యుద్ధభేరి సభా స్థలాన్ని బీసీ సంఘాల నాయకులు పరిశీలించారు.

ఈ విలేకరుల సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పల్లెబోయిన అశోక్, బొనగాని యాదగిరి గౌడ్, వడ్నాల నరేందర్, పులి రజనీకాంత్, రవీందర్ రాజయ్య, శ్యాం, అరుణ, ఓదెలు, కనకరాజు, సురేందర్, బయ్య స్వామి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా సమాయత్తం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఏకశిల ఏంజిల్స్ హైస్కూల్‌లో రెండురోజుల పాటు ఉపాధ్యాయులకు పదవ తరగతి విద్యార్థుల కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈవో మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్నత విద్యనభ్యసించడానికి తొలిమెట్టు అన్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేయాలన్నారు.

కార్యక్రమంలో పూర్ణచందర్, మహేష్, సుధాకర్, అశోక్, సోమనాధరాజు ఆర్పీలుగా వ్యవహరించగా, జిల్లా సెక్టోరియల్ అధికారులు ఆజాద్‌చంద్రశేఖర్, అప్పారావు, మందుల శ్రీరాములు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

విద్యార్థుల పాత్ర చైతన్యవంతంగా ఉండాలి

- ప్రజాకవి కొమిరె సాకి



పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాకవి కొమిరె సాకి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర చైతన్యవంతంగా ఉండాలని ప్రజాకవి కొమిరె సాకి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సంఘం జెండాను జిల్లా నాయకులు బి.దేవేందర్ ఎగురవేశారు. అనంతరం విద్యార్థి అమరులకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రజాకవి కొమిరె సాకి మాట్లాడుతూ... నేటి సమాజంలో విద్యారంగాన్ని పాలకులు సామాజిక బాధ్యత నుంచి తప్పించి కార్పోరేట్ హస్తగతం చేశారని ఆరోపించారు. కార్పోరేట్ విద్యాసంస్థలు మార్కులు, ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ప్రశాంతతకు దూరంచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు మహనీయులు, శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మధార్, సాంబచ పాపారావు, గణేష్, నవీన్, ప్రకాష్, సౌజన్య, నూతన్, వినోద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దవంగర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ ఇంజనీర్ జె.నరేష్ అన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పోచంపల్లి, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న 33కేవీ ఫీడర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన స్తంభాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు అందిస్తామన్నారు. విద్యుత్‌షాక్ రాకుండా విధిగా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం తగ్గుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందిని కోరారు. విద్యుత్‌ను ప్రజలువాడకంలో పొదుపు పాటించాలన్నారు. విద్యుత్ వనరులను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

విద్యుత్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఇంజనీర్ జె.నరేష్ కోరారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఉన్నట్లుతే స్థానిక విద్యుత్ అధికారులను తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏడీఏ చలపతిరావు, ఏఈలు రమేష్‌బాబు, నిహాల్, జేఎల్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కరెంట్ సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్

- ట్రాన్స్‌కో ఎస్ఈ నరేష్

మరిపెడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం మరిపెడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరిపెడ సబ్ డివిజన్‌స్థాయి విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటి సామర్థ్యం పెంచే యోచన చేస్తున్నామన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ 1,100 కేవీఏలు 4, రూరల్ మండలంలో 25 కేవీఏలు 26 ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. లైటింగ్ డీటీఆర్‌లను అమలు చేస్తామన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏడీఈ అజయ్, ఏఈలు పావనీ, నవ్య, లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ నరేష్

మరిపెడ ఏడీఈగా అజయ్

మరిపెడ : మరిపెడ ట్రాన్స్‌కో ఏడీఈగా బి.అజయ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏడీఈ లోక్‌నాథ్ రెడ్డి నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎల్లంపేట ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న అజయ్‌ను ఇక్కడికి ఇన్‌చార్జ్ ఏడీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎల్లంపేట, గిరిపురం, చిన్నగూడూరు ట్రాన్స్‌కో సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన హాస్టల్‌ను పరిశీలించిన ఆర్‌సీవో

కేసముద్రం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం గిరిజన సంక్షేమ బాలికల గురుకులాన్ని శుక్రవారం మహబూబాబాద్ ప్రాంతీయ సమన్వయకర్త హరిసింగ్ పరిశీలించారు. ఈ గురుకులంలో ఆరో తరగతి చదివి విద్యార్థిని అస్వస్థతకు గురైన విషయంపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా వంట వండే పరిసరాలను పరిశీలించి, ఆరో తరగతి విద్యార్థులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ సదరు విద్యార్థిని ఈనెల 26న కుటుంబ సభ్యులు ఇచ్చిన చికెన్ తినడంతో కడుపునొప్పితో అస్వస్థతకు గురైనట్లు ఆర్‌సీవోకు తెలిపారు. గురుకులంలో ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని, కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆర్‌సీవో వెంట డీసీవో నారాయణనాయక్, తహసీల్దార్ దామోదర్ ఉన్నారు.

కోటగుళ్లను దర్శించిన కాగ్ అధికారి



పూజలు చేస్తున్న కాగ్ అధికారులు

గణపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడమైన కోటగుళ్లను కాగ్ ఆడిట్ అధికారి శివకుమార్ శుక్రవారం సందర్శించారు. అర్చకుడు నాగరాజు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఆడిట్ అధికారి రవికుమార్ ఉన్నారు.

కొంగలు.. రైతు నేస్తాలు



పుడమి బిడ్డలైన రైతులకు మిత్రులు కానివారెవరుంటారు. చెట్టుచేమల్లో.. పొలం గట్లలో ఆ నేస్తాలు వారిని అనుసరిస్తూనే ఉంటాయి. అలాగే కొంగలు కూడా నిత్యం పొలాలపై సంచరిస్తూ ప్రకృతి అందాలను రెట్టింపు చేస్తుంటాయి. పొలం దుక్కి దున్నినప్పుడు.. బురద గొర్రు తోలినప్పుడు.. మట్టిలో కనిపించే కీటకాలను తినేందుకు అవి నాగళ్లు, గొర్రులు, ట్రాక్టర్ల చుట్టూ చక్కర్లు కొడుతుంటాయి. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో శుక్రవారం ఓ రైతు ట్రాక్టర్‌తో పొలం గొర్రు చేస్తున్న సమయంలో ఇలా కొంగలు సందడి చేశాయి.



చిత్రాలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

న్యాయం కోసం పోరాడుదాం

- సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్



సమావేశంలో మాట్లాడతున్న మిట్టపల్లి సురేందర్

భూపాలపల్లి టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగకు అండగా నిలబడి పోరాడేందుకు అన్ని వర్గాల మేధావులు, కళాకారులు, ప్రజలు ఒక్కటయ్యారని సినీగేయ రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ అన్నారు. ఈ న్యాయ పోరాటాన్ని కొనసాగించి వర్గకరణను సాధించుకోవాలన్నారు. భూపాలపల్లిలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలది న్యాయమైన పోరాటమని అన్నారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాడుతున్నారన్నారు. ఈ క్రమంలోనే వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతులు అనే సాంస్కృతిక భారీ ప్రదర్శన కార్యక్రమానికి లక్షలాదిగా తరలివచ్చి వర్గీకరణకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, నాయకులు పుల్ల శ్రీనివాస్, గోల్కొండ బిక్షపతి, అంతడుపుల సురేష్, నోముల శ్రీనివాస్, వంశీ, పాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయండి

ములుగు కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న జరిగే లక్ష డప్పులు...వేయి గొంతులు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. ములుగులో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సాంస్కృతిక ప్రదర్శనకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి ఇరుగు పైడి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, వివిధ సంఘాల నాయకులు గుగ్గిళ్ల సాగర్, తరుణ్, భూక్య భద్రునాయక్, ముత్యాల రాజు, ముంజాల భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2369	2130
పల్లికాయ (సూక)	6200	4600
పల్లికాయ (పచ్చిది)	5550	3100
కందులు	6533	5540
పెసళ్లు	7501	5133
పత్తి	7000	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14700	11500
ఎల్లో మిర్చి	16500	13500
యూఎస్341	14300	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రామచంద్రం

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన వీసీ ప్రతాప్‌రెడ్డి



రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంకు ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కొత్త రిజిస్ట్రార్‌గా కేయూ సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కేయూ రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ ఉమ్మడి జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌లో పేద దళిత కుటుంబంలో జన్మించి ఉస్మానియా, కాకతీయ వర్సిటీల్లో ఉన్నత చదువులు చదివి స్వయం కృషితో ప్రొఫెసర్‌గా వల్లూరి రామచంద్రం ఎదిగారు. కేయూలో అనేక అకాడమిక్, పరిపాలన పదవులు చేపట్టారు.

పరిపాలనా సమర్థుడు..

కాకతీయ యూనివర్సిటీలో కొత్త రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వర్సిటీలో 1991లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అనేక పదవులు నిర్వహించి సమర్థులుగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం దూర విద్య కేంద్రం డైరెక్టర్‌గా, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీడీసీ) డీన్‌గా, వర్సిటీ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 33ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో ఆరుగురు పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను పొందారు. 47 సెమినార్లతో పాటు కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యారు. 2 పుస్తకాలు, మరో 34 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఓయూలో రాజనీతి శాస్త్రం, ఎస్వీలో మనోవిజ్ఞాన శాస్త్రం, కేయూలో విద్యవిభాగాల్లో పీహెచ్‌డీపరిశోధనలుచేసి డాక్టరేట్ పొందారు.

అభినందనల వెల్లువ..

ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టగానే వర్సిటీలోని ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, స్కాలర్లు, విద్యార్థులు, ప్రజా సంఘాల బాధ్యులు పుష్పగుచ్ఛం, శాలువాలు అందచేసి ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. వారిలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.నాగరాజు, ఎఫ్‌వో రాజయ్య, టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను, చరిత్ర టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, వర్సిటీ బోధన, బోధనేతర సంఘాల నేతలు, స్కాలర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కేంద్రం కరుణించేనా?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకాన్ని 202-22లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఫార్మ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్ (ఫైవ్ ఎఫ్) విధానంతో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని కోసం 2021-22 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు రూ.4,445కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. దేశవ్యాప్తంగా ఏడు టెక్స్ పార్కుల్లో రాష్ట్రానికి ఒకటి కేటాయిస్తున్నట్లు 2023 మార్చి 18న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. అయితే అప్పటికే రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన కేఎంటీపీ ఉండటంతో పీఎం మిత్ర కింద దీన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. పీఎం మిత్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కేఎంటీపీ లేదని కేంద్రం వాదించింది. ప్రధానంగా కేంద్రం వాటా 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతంగా ఉంటుంది. పీఎం మిత్ర నిబంధనల ప్రకారం టెక్స్‌టైల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలి. అలాగే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ పిలిచి డెవలపర్‌ను ఎంపిక చేయాలి. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి దానికి టెక్స్‌టైల్ శాఖ ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, మంచినీరు, వృథా నీటి శుద్ధి తదితర సౌకర్యాలతో పాటు ఉత్పత్తి చేసిన వస్త్రాల డిజైనర్లు, దుస్తుల తయారీదారులు, ఇంక్యుబేషన్ సెంటర్లకు ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అలాగే కామన్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ, కామన్ ఎఫ్లుయెంట్, ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ), కార్మికులకు వసతి సదుపాయం, ఆరోగ్య సౌకర్యాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ లాంటి అదనపు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. కంపెనీలకు స్థలాల కేటాయింపు సైతం స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పీవీ) ఆధ్వర్యంలో చేపట్టాలి. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే మొదటి దశలో రూ.300కోట్లు, రెండో దశలో రూ.200కోట్లు, మూడో దశలో రూ.500కోట్లు కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. అంతేకాకుండా ఈ పార్కులో ఏర్పాటు చేసే కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇస్తుంది. అయితే ఇప్పటికే భూ సేకరణతో పాటు కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయి కుదుర్చుకుంది. దీంతో పీఎం మిత్రను అమలు చేసేందుకు కేంద్రం కొర్రీలు పెడుతుందనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో పీఎం మిత్రలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కోరటంతో కేంద్ర ఏలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే ఆసక్తి ప్రజల్లో నెలకొంది.

లెదర్ పార్కు.. సైనిక్ స్కూల్‌పై ఆశలు?

జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలో లెదర్ పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. దీంతో మూడు దశబ్దాలుగా ఎదురుచూస్తున్న స్టేషన్‌ఘనపూర్‌లోని శివునిపల్లి లెదర్ పార్కుకు మోక్షం లభించేనా అనే ఉత్కంఠ నెలకొంది. శివునిపల్లిలో 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ ప్రభుత్వ హయంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారిపై చైన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికి ఇప్పటివరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. సుమారు వెయ్యి కోట్ల నిధులతో లెదర్ పార్కులను అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ బడ్జెట్‌లో లెదర్ పార్కుకు నిధులు వచ్చేనా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 2016లో వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా పునాదులు కూడా పడటం లేదు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన భూమి, భవనాల నిర్మాణం, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ.5కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తొలుత హసన్‌పర్తి మండల కేంద్రంలో.. ఆ తరువాత ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. భూ కేటాయింపుల నిర్లక్ష్యంతో వరంగల్‌కు వచ్చిన సైనిక్ స్కూల్ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కొత్తగా ప్రకటించే సైనిక్ స్కూళ్లల్లో వరంగల్‌కు చోటు దక్కుతుందా అనేది ఉత్కంఠగా మారింది.



వెనుకబడిన జిల్లాల అభివృద్ధి మాటేమిటో..?

ఏటా వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి, ములుగు జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా నీతిఅయోగ్ గుర్తించింది. వీటికి 2017 నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. అయితే 2022 నుంచి వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపులకు బ్రేక్ పడింది. దీంతో ఈ ఏడాది బడ్జెట్‌లో రాష్ట్రంలోని మూడు వెనుకబడిన జిల్లాలకు రూ.1,350 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందా.. లేదా అనే ఉత్కంఠ నెలకొంది.

రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీకి నిధులు వచ్చేనా?

కాజీపేటకు రైల్వే డివిజన్ హోదాతో పాటు కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయింపుపై ఈ బడ్జెట్‌లో కేంద్రం తేల్చుతుందనే ఆశతో ఓరుగల్లువాసులున్నారు. ఎన్నో ఏళ్లుగా కోచ్‌ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు చేస్తుంటే 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాజీపేటలో భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. అయితే విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీపై హామీ ఉంటే కేంద్రప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఇచ్చి చేతులు దులుపుకుందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన రైల్వే బోర్డు వ్యాగన్ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తు ఆదేశాలు జారీ చేసింది.

అప్‌గ్రేడ్ చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసేలా యూనిట్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయిస్తుందనే ఆశతో ఉన్నారు. అలాగే కాజీపేట డివిజన్ కోసం ఎన్నో ఏళ్లుగా రైల్వే ఉద్యోగులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ సెంట్రల్ కోస్ట్ జోన్ ఏర్పాటవుతుండటంతో కాజీపేట డివిజన్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి నిధులతో పాటు డివిజన్ హోదాపై బడ్జెట్‌లో కేంద్రం వరాలు కురిపిస్తుందనే ఆశతో ఉన్నారు.

మరిన్ని ప్రాజెక్టులపై ఆశలు..

- మామునూరు ఎయిర్ పోర్టుకు భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాలిసిన నిధులను ఈ బడ్జెట్ కేంద్రం కేటాయిస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.
- కోల్ రైల్ ప్రాజెక్టుకు ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైంది. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా రామప్ప, మేడారం, ఏటూరునాగారం నుంచి మణు గూరుకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలో మీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభం కానున్నాయి.
- కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికి నిధులు కేటాయింపులు చేయాల్సి ఉంది.
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేసింది. నిధులుకేటాయిస్తే పనులుమొదలయ్యే అవకాశం ఉంది.
- డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5 వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంది.
- 2023-24 బడ్జెట్‌లో కాజీపేట-భూపాలపల్లి మధ్య 64కి.మీ నిర్మించే రైల్వే లైన్‌కు ఫైనల్ లోకేషన్ సర్వే కోసం రూ. 1,152కోట్లు కేటాయించింది. సర్వే పూర్తి చేసి, నిధులు కేటాయిస్తే కోల్‌బెల్ట్‌తో వరంగల్ నగరానికి దూరాభారం తగ్గనుంది.
- ములుగు గిరిజన యూనివర్సిటీకి రూ.889.07కోట్ల నిధులు అవసరం. భూకేటాయింపులు పూర్తి కావటంతో పాటు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. నిధులు కేటాయిస్తే వర్సిటీకి కావాల్సిన నిర్మాణాలు, సామగ్రి కొనుగోళ్లు షురూ చేసే అవకాశం ఉంది.

సినిమాల రాంబాబు మనోడే..

▸▸ సినీ రంగంలో రాణిస్తున్న ఏటూరునాగారం వాసి

▸▸ రామన్నగూడెం నుంచి ఫిలింనగర్‌కు..

▸▸ పలు భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలతో తెరపై రాణింపు



వకీల్‌సాబ్ సినిమాలో ఓ సన్నివేశంలో..


ఏటూరునాగారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ యువతకు స్ఫూర్తిగా.. ఎన్ని కష్టాలు ఎదురైనా.. పట్టుదలతో కన్న కలలను సాకారం చేస్తూ అనేక మందికి ప్రేరణగా నిలుస్తున్నాడు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన మామిడి రాంబాబు. తన గురువు ప్రోద్బలంతో రాజధానికి వెళ్లి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు శ్రమిస్తున్నాడు. తొలినాళ్లలో చేసింది చిన్న పాత్రలే అయినా తన నటనతో ప్రేక్షకుల మన్ననలు పొంది.. క్రమంగా పలు భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నాడు. సినిమాలు, సిరియళ్లు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ సినిమాల రాంబాబుగా స్థానికులతో పిలిపించుకుంటున్న రాంబాబు 2015లో వచ్చిన బాహుబలి-1 సినిమా కోఆర్డినేటర్‌గా పని చేసిన వినయ్‌తో ఉన్న పరిచయంతో సినీ రంగానికి దగ్గరై ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అంతగా చదువుకోని ఆయన ఓ కిరాణం షాపులో పని చేసేవాడు. ఆ తర్వాత ఓ కాంట్రాక్టర్ దగ్గర కొంత కాలం కొనసాగాడు. మెగాస్టార్ చిరంజీవికి వీరాభిమాని అయిన రాంబాబు సినిమాలపై ఆసక్తితో పది సంవత్సరాల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో బాహుబలి-1 సినిమాలో సైనికుడిగా నటించి, పనిచేసే అవకాశం లభించింది. ఆ సమయంలోని సినిమా కార్యాలయాల్లోని వారితో పరిచయాలు పెరిగాయి. ప్రారంభంలో రోజుకు రూ.300 వరకు వేతనం పొందిన రాంబాబు నేడు క్రమక్రమంగా ఆది రూ.10వేలకు చేరింది.



ఓచిత్రంలో విలన్ సోనుసూద్ బృందంలో ఒకడిగా..

పెద్ద హీరోలతో..

చిరంజీవి, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, రవితేజ, మహేష్ బాబు, ప్రభాస్, గోపిచంద్ వంటి పెద్ద హీరోలతో నటించాడు. పలు సినిమాల్లో విలన్ పాత్రలు కూడా పోషించాడు. రాజమౌళి, త్రివిక్రమ్, వీవీ వినాయక్, రాంగోపాల్ వర్మ తదితర అనేక మంది పేరున్న డైరెక్టర్ల సినిమాల్లో నటించి మెప్పించాడు. బాహుబలి 1, 2, వీవీ వినాయక్ దర్శకత్వం వహించిన ఖైదీ నెంబర్-150 సినిమాలో అలీని కిడ్నాప్ చేసే సన్నివేశంలో నటించాడు. అంతేకాకుండా సర్దార్ గబ్బర్ సింగ్, సౌఖ్యం, నేనే రాజు నేనే మంత్రి, శ్రీమంతుడు, తిక్క, చుట్టాలబ్బాయి, రాజాది గ్రేట్, రాధ, నాపేరు శివ నా ఇట్లు ఇండియా, చలో మోహనరంగ, కురుక్షేత్రం, శరభ, గౌతమిపుత్ర శాతకర్ణి, కాటమ రాయుడు, శౌర్యం, డిటెక్టర్, అటాక్, మరుల తెలపవ ప్రియ లాంటి సినిమాల్లో విలన్ బృంద సభ్యుడిగా వివిధ పాత్రలు పోషించాడు. భగవంత్ కేసరి, సరిపోదా శనివారం, స్వయంభూ సింగం, అజయ్ దేవగన్(హిందీ), గేమ్ ఛేంజర్, రాబిన్హుడ్, పుష్ప-2, కన్నప్ప, కూలీ, ప్రణయ గోదారి, భీమా, కుంభస్థలం, బాలకృష్ణ డాకుమహారాజ్ సినిమాల్లో నటించాడు. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్లో మహేష్ బాబు హీరోగా నటిస్తున్న సినిమాలో అవకాశం దక్కించుకున్నాడు.



బాహుబలి 1లోని ఓ సన్నివేశంలో గుర్రంపై రాంబాబు (ఫైల్)

బుల్లితెరపై..

సినిమాలే కాకుండా బుల్లితెరపైనా నటిస్తూ మెప్పిస్తున్నాడు రాంబాబు. స్వాతి చినుకులు, రాధాగోపాలం, మంగమ్మగారి మనవరాలు, రాములమ్మ, అగ్నిపూలు, అమెరికా అమ్మాయి, గోకులంలో సీత, అగ్నిసాక్షి, కుంకుమ పువ్వు, నాపేరు మీనాక్షి, ప్రతిఘటన, తులసిదళం, మనస్సు మమత, ఆడదే ఆధారం, అగ్నిసాక్షి, నిండు నూరెళ్ల సావాసం, శ్రావణ సంధ్య, ప్రేమ ఎంత మధురం, గుప్పెడంత మనసు, సూర్యకాంతం, అభినందన, మా అన్నయ్య, లక్ష్మి సౌభాగ్యవతి, చిన్ని, గుండమ్మ కథ, రంగుల రత్నం, సత్యభామ లాంటి అనేక సీరియల్‌ళ్లు, వెబ్ సరిస్‌లో రాంబాబు రాణిస్తున్నాడు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

కాజీపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళాకు ఫిబ్రవరి 18, 22 తేదీలలో ప్రత్యేక రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు (07077, 78,) చర్లపల్లి - దానాపూర్‌ల మధ్య అప్ అండ్ డౌన్ నడుస్తుందని తెలిపారు. కాజీపేటలో మధ్యాహ్నం 3 గంటలకు హాల్టింగ్ ఉంటుందని తెలిపారు. జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షాలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

పోలీసు క్రీడల్లో ఏసీపీలకు పతకాలు



పతకాలతో ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, అనంతయ్య

వరంగల్ క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏసీపీలు ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఏఆర్ ఏసీపీ అనంతయ్యలు పలు పతకాలను కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ 55 సంవత్సరాల డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి- మధుసూదన్ జోడి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. 50 సంవత్సరాల డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి- అనంతయ్య జోడి రజిత పతకాన్ని గెలుచుకున్నారు. టెబుల్ టెన్నిస్ విభాగంలో మధుసూదన్- అనంతయ్య కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. బ్యాడ్మింటన్ సింగిల్‌లో జితేందర్‌రెడ్డి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన ముగ్గురు ఏసీపీలను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

నేడు, రేపు బొడ్రాయి ఉత్సవాలు

- **ముస్తాబైన రంగశాయిపేట బొడ్రాయి**
- **హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ**



గ్రామ దేవతలు

శంభునిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతల వార్షికోత్సవాలకు రంగశాయిపేట ముస్తాబైంది. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల కోసం ఆర్‌వైఎఫ్ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) ఆధ్వర్యంలో రంగశాయపేటలో గత సంవత్సరంబొడ్రాయి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగశాయిపేట నెహ్రూ విగ్రహం వద్ద బొడ్రాయిని ప్రతిష్ఠించటంతోపాటు రామాలయం వద్ద బొడ్రాయిని పునః ప్రతిష్ఠించారు. అనంతరం శాస్త్రీయంగా తిరుగువారం, మండల పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం వార్షికోత్సవాల కోసం బొడ్రాయి నిర్వహణ కమిటీ బాధ్యులుతగిన ఏర్పాట్లుచేస్తున్నారు. శనివారం గణపతి పూజతో పూజలు ప్రారంభించి సామూహిక హోమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం గ్రామదేవతలకు బోనాలు సమర్పిస్తారు. ఈ వేడుకలకు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



సిద్ధమైన బొడ్రాయి ప్రాంగణం

దక్షిణమధ్య రైల్వేలో పీవోహెచ్

▸▸ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు

▸▸ కాజీపేటలో భూమి లేదని లేఖ ఇచ్చినట్టు సమాచారం

▸▸ మహబూబాబాద్, డోర్నకల్‌లో రైల్వే భూములు

▸▸ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై లేని స్పష్టత



మహబూబాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని సికింద్రాబాద్ డివిజన్‌లో నూతనంగా పిరియాడికల్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్) యూనిట్ ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. భారతీయ రైల్వేలో 2027 వరకు 3 వేల మిలియన్ టన్నుల (సుమారు రూ.300 కోట్ల టన్నులు) సరుకు రవాణా చేయాలని రైల్వేశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఆ లక్ష్యానికి చేరుకోవడానికి తీవ్రమైన లోకోమోటివ్‌ల కొరత ఉన్నందున వాటిని సమకూర్చుకోవడానికి రైల్వేశాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకుగాను 7014 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లు అవసరం అవుతాయని అంచనా వేసింది. 2022-23 సంవత్సరాల నుంచి రాబోయే ఐదేళ్లలో వీటిని దశలవారీగా సమకూర్చుకోవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రతీ ఏడాది 1400 లోకో మోటివ్‌లను సమకూర్చుకోవడానికి రైల్వేబోర్డు అంగీకరించింది. దీని కొరకు అన్ని జోనల్ పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పెద్దఎత్తున మానవ వనరులను సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం భూమి విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై స్పష్టత రాలేదు.

దక్షిణమధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతం..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 894 ఎలక్ట్రికల్ లోకో మోటివ్‌లు, 570 డిజిల్ లోకోమోటివ్‌లు ఉన్నాయి. 3వేల మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవడానికి దక్షిణ మధ్యరైల్వేకు రెండు వేల గూడ్స్ లోకోమోటివ్‌లు, 480 కోచ్ లోకో మోటివ్‌లు అవసరం అవుతాయి. పెద్ద ఎత్తున సమకూర్చుకోనున్న లోకోమోటివ్‌ల నిర్వహణ కోసం పీవోహెచ్ యూనిట్ తప్పనిసరి కావడంతో నూతనంగా వాటిని ఏర్పాటు చేయాలని, అప్పుడు లక్ష్యాన్ని చేరుకోడానికి అవకాశం ఉంటుందని భావించిన రైల్వేశాఖ పీవోహెచ్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది.

పీవోహెచ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు..

భారీ సంఖ్యలో లోకోమోటివ్‌లు సమకూర్చుకుంటున్నందున దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వాటి నిర్వహణకు అవసరమైన పీవోహెచ్ యూనిట్ ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకు గాను వంద లోకోమోటివ్‌ల నిర్వహణకు అవసరమైన పీవోహెచ్‌లు మొదటి దశలో ఏర్పాటు చేయడానికి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కాజీపేట పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌ను ఆదేశాలు వచ్చాయి. పీవోహెచ్ ఏర్పాటుకు అవసరమైన రైల్వే భూమి ఉంటే వివరాలు తెలపాలని, రైల్వే భూమితో పాటు రాష్ట్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల వివరాలు సైతం తెలపాలని ఆదేశించింది.

జీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలకు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం నుంచి జవాబిస్తూ కాజీపేటలో పీవోహెచ్ ఏర్పాటుకు 130 ఎకరాల భూమి అవసరం పడుతుందని, ప్రస్తుతం కేవలం 10 నుంచి 15 ఎకరాల రైల్వేకు సంబంధించిన భూమి మాత్రమే ఉందని తెలిపారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున భూమి లభ్యతలేదని లేఖలో పేర్కొన్నట్టు సమాచారం. అలాగే రాష్ట్రప్రభుత్వ సహకారంతో గతంలో దేవాదాయ భూమిని కూడా సేకరించి వ్యాగన్ తయారీ కేంద్రానికి సమకూర్చినట్లు డీఆర్ఎం కార్యాలయం తెలిపింది.

విజయవాడలోని రాయనపాడులో..

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడలోని రాయనపాడులో 84 ఎకరాల స్థలంలో పీవోహెచ్ యూని ట్ ఏర్పాటు జరుగుతున్నట్లు తెలిపింది. ఇందులో ఏడాదికి కేవలం 60 లోకో మోటివ్‌ల వార్షిక నిర్వహణ మాత్రమే వీలుపడుతుందని డీఆర్ఎం కార్యాలయం తెలిపింది. దేశంలో ప్రస్తుతం 5,524 లోకో మోటివ్‌లున్నాయి. ప్రతీ ఏడాది వీటిలో 627 లోకోలకు వార్షిక మరమ్మతులు పీవోహెచ్‌ల ద్వారా నిర్వహించాలి. కానీ, కేవలం 426 లోకోల నిర్వహణకు మాత్రమే ప్రస్తుతం ఉన్న పీవోహెచ్‌ల ద్వారా వీలవుతుంది. అందుకే నూతనంగా అవసరం ఉన్నచోట పీవోహెచ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

మహబూబాబాద్, డోర్నకల్‌లో రైల్వే భూములు..

పీవోహెచ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన భూములు మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్నాయి. అలాగే డోర్నకల్ రైల్వేజంక్షన్ పరిధిలో సైతం పెద్దఎత్తున రైల్వే భూములు ఉన్నాయి. వీటితో పాటు అవసరమైన భూములను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సైతం సేకరించడానికి వీలుపడుతుంది. మహబూబాబాద్ జిల్లాలో పీవోహెచ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎదురుచూస్తున్నారు. రైల్వేశాఖ అధికారులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను రక్షించుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లాకేంద్రంలోని రవాణశాఖ కార్యాలయంలో జరగగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత మనందరి బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించాలని అన్నారు. ప్రచారం సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతలో ప్రజలు భాగస్వామ్యమైతే ప్రమాదాలను నివారించవచ్చని, వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా రవాణశాఖ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ యాక్షన్‌ప్లాన్ రూపొందించాలి

జిల్లాలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీయాలని, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడునెలలకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకుని మూడునెలలకుగాను ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గత సంవత్సరం అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నా య ఏర్పాట్లు, సమీపంలో ఉన్న బావులు, చెరువులు, చేతిపంపులు, లోక్ బోర్లు, ట్యూబ్ వెల్స్, వ్యవసాయ బోర్లను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ వరంగల్ సీఈ కె.సురేష్, ఎస్ఈ మల్లేశం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

కలెక్టర్‌కు దళితబంధు సమితి వినతి

రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ చిట్టమల్ల సమ్మయ్య ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సమ్మయ్య మాటాడుతూ రెండో విడత దళితబంధు లబ్ధిదారులకు మంజూరు చేసిన నిధులను వారి అకౌంట్లలో జమచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావేరి చిన్నికృష్ణ, కవ్వంపెల్లి బాబు, దర్శనాల సంజీవ, జనగాం రవి, రామకృష్ణ, రాంబాబు, ఓంకార్, రవి, దేపాక శ్రీరాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ క్యాలెండర్ ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర జాతీయ మానవహక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) తెలంగాణ కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ చట్టాలను అనుసరించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేని సమాజం కోసం, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండేందుకు ఎన్‌హెచ్ఆర్‌సీ ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. జిల్లా రవాణశాఖ అధికారి శ్రీనివాస్, ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర కమిటీ సభ్యులు పోరిక రవీందర్, హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు, స్టేట్ సోషల్‌మీడియా కోకన్వీనర్ కోడిపాక రవి, నాయకులు కట్టయ్య, గట్ల రవి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి: డీఈవో

వెంకటాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మండలంలోని జవహర్‌నగర్ మోడల్‌స్కూల్‌లో జిల్లాలోని ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా డీఈవో పాణిని ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నిర్మాతలు ఉపాధ్యాయులేనని, విద్యార్థి ఉన్నత శిఖరాలవైపు పయనించాలంటే మార్గనిర్దేశకుడిగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా శక్తి దాగి ఉంటుందని, వారిలో ఉన్నటువంటి గొప్ప లక్షణాన్ని, శక్తిని గుర్తించి తనపై తనకు నమ్మకం కలిగిస్తూ మార్గనిర్దేశం చేసినట్లయితే వారు అద్భుతాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ఎలాంటి భయం లేకుండా ప్రశాంతమైన స్వేచ్ఛ వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల, విద్యార్థుల అవసరాన్నిబట్టి సృజనాత్మక కార్యక్రమాలను జోడిస్తూ ములుగు జిల్లాను రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, కోఆర్డినేటర్లు సాంబయ్య, సైకం శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, రిసోర్స్‌పర్సన్లు, 53పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల నిరసన

వాజేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్, సిస్టం షట్‌డౌన్ ద్వారా తమ నిరసనను తెలిపారు. తమకు పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో తమపై ఆర్థికభారం పడుతోందని అన్నారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎం.రాజు, సీవోలు స్వప్న, ఈశ్వర్, ఈసీ సత్యేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికెల్‌సెల్ నిర్ధారణ పరీక్షలు

వాజేడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీజీడబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థినులు శుక్రవారం సికెల్‌సెల్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. వసతిగృహంలో వైద్యశిబిరం నిర్వహించిన వైద్యాధికారులు విద్యార్థులకు సికెల్‌సెల్‌పై అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యార్థు లకు లెప్రసీపై సైతం అవగాహన కల్పించారు. వచ్చే నెల 13న వరకు అన్ని గ్రామాల్లో లెప్రసీపై పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, వార్డెన్ తిరుపతమ్మ, హెచ్ఎస్ కోటిరెడ్డి, సిబ్బంది రఘు, చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి చంద్రకళ అన్నారు. శుక్రవారం ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులతో జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా 1164మంది రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు, 241 మంది రెండోసంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. పరీక్ష సమయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈసమావేశంలో ఇంటర్ విద్యాశాఖ అధికారులు వీరేందర్, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత, పర్యవేక్షణ అధికారులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

'బీసీ రాజకీయ యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి : మెపా

ములుగు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ములుగులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 78ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో బీసీల స్థానం రోజురోజుకూ దిగజారిపోతుందని, వివిధ రాజకీయ పార్టీలు బీసీలను ఓటర్లుగా, ఓట్ల రాజకీయం కోసమే వాడుకుని రాజ్యాధికారాన్ని దూరం చేశాయని అన్నారు. రాజ్యాధికారంలో మన వాటా కోసం పోరాడడానికి సమయం ఆసన్నమైందని, యుద్ధభేరి కార్యక్రమానికి జిల్లాలోని బీసీలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాధు రాజు, భూమ నరేష్, మేకల రమేష్, కుక్కల కౌశిక్, నర్ర భద్రయ్య, కాసర్ల కుమార్, చిగురు దేవేందర్, మేకల రవీందర్, బోగిరి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

చలి మంటల్లో పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చలి మంటల్లో పడి విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల ఆశ్రమ బాలుర పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అదే గ్రామానికి చెందిన ఎట్టి భూదేశ్ అనే గొత్తికోయ విద్యార్థి పాఠశాల వద్ద చలి మంటల కోసం ఎండు గడ్డికి నిప్పు పెట్టాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చలి మంటలు కాగుతూనే భూదేశ్ మంటల్లో పడిపోయాడు. దీంతో అతడవికి రెండు కాళ్లు కాలిపోయి చర్మం ఊడిపోయింది. ఆ సమయానికి పాఠశాలలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో పాటు గాయపడి విద్యార్థిని చూసేవారే లేకపోయారు. దాంతో విద్యార్థి అదే గ్రామానికి చెందిన వాడు కావడంతో తీవ్ర గాయాలతోనే ఏడ్చుకుంటూ వారి ఇంటికి వెళ్లాడాడు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ అధికారులు ఆ గ్రామానికి అంబులెన్స్‌ను పంపించి విద్యార్థిని అంబులెన్స్ ద్వారా మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతులకు న్యాయం చేస్తాం : ఆర్డీవో

టేకుమట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ఆర్డీవో ఎన్.రవి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులతో ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలను, వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. హైవే నిర్మాణం కోసం రైతులు సహకరించాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం తదితర విషయాలపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్ఐ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా రాజు



టేకుమట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం టేకుమట్ల మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన దూడం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా నాయకుడు ఆడెపు సంపత్ అధ్వర్యంలో శుక్రవారం నూతన మండల కమిటీని ఎన్నుకు న్నారు. ఉపాధ్యక్షుడిగా ఆడిచర్ల బలరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కుడికాల రాజేందర్, సహాయ కార్యదర్శిగా ఆనందపు రాజేందర్, కోశాధికారిగా నాగుల సాంబశివుడు, ప్రచార కార్యదర్శిగా పెంట రంజిత్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా గాజుల ఓదెలు, శంకర్, హనుమంతు, బండి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రాజేంద్రప్రసాద్, అడ్డగట్ల శ్రీధర్, శ్రావణ్, వివిధ గ్రామాల పద్మశాలి కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



మహేష్



సిరాజుద్దీన్

మొగుళ్లపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి మండల డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్ను కున్నారు. మండల అధ్యక్షు డిగా మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన తోటపల్లి మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఆకినపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎమ్డీ.సిరాజుద్దీన్ ఎన్నిక య్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాస్, ఇ.రాణి, ఆర్.రాజేం దర్, కార్యదర్శులుగా ఎల్.రాజేశ్వర్‌రావు, సీహెచ్.వెంకటస్వామి, ఎమ్డీ.అబ్దుల్ రహీం, డి.ఇందిర, జిల్లా కౌన్సిలర్లుగా జి.శ్రీనివాసరెడ్డి, కె.సదానందం, జి.రవీందర్‌రెడ్డి, కె.రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఉయ్యాల సురేందర్, సభ్యులుగా ఎం.శ్రీలత, బి.మౌనిక ఎన్నికయ్యారు.

మిరప తోటల పరిశీలన

చిట్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లగరిగ శివారులో మిరప పంటలను హర్టికల్చర్ డీఈ సునీల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఒక కంపెనీకి చెందిన మిరప విత్తనాలు సాగుచేస్తే మిరపలో పూత, కాత రావడంలేదని ఇటీవల రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పంటలను సందర్శించామన్నారు. సంబంధిత వివరాలను జిల్లా అధికారులకు తెలిపి, మరోసారి వ్యవసాయ శాస్త్రవేత్తలతో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తామన్నారు.

మునిసిపల్ సిబ్బందితో కమిషనర్ సమావేశం

భూపాలపల్లిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సిబ్బందితో శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన పన్నుల బకాయిలు వెంటనే 100శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మృతదేహం లభ్యం

మహదేవపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని మంగళికుంట చెరువులో మృతదేహం లభ్యమైంది. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన సమ్మయ్య (55) భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం గుడి వద్ద ఉంటూ భిక్షాటన చేసేవాడు. మంగళికుంట చెరువులో తామర పూలు కోసి అమ్ముతుండే వాడు. కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతయ్యాడు. చెరువులో మృతదేహం ఉన్న విషయాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ యుద్ధభేరి సభకు తరలిరావాలి

రేగొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ యుద్ధభేరి సభకు తరలి రావాలని బీసీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాదండి దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం బీసీ రాజకీయ యుద్ధబేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ బీసీలు ఐక్య పోరాటాలు చేసి రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోపు భిక్షపతి, బీసీ సంఘం జిల్లా నాయకుడు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు' ప్రదర్శనలో పాల్గొనాలి

మల్హర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహా ప్రదర్శనలో భారీ సంఖ్యలో తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేష్ కోరారు. తాడిచర్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మందకృష్ణ మాదిగ నిర్వ హించబోతున్న కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి డప్పు చంకన వేసుకొని తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, ఖమ్మంపల్లి సందీప్, నారమల్ల ఎర్ర పోశం, ఇందారపు రవి, జంగం సుమన్, ఇందారపు మల్లేష్, హేమంత్, అరుణ్, చంటి, భాస్కర్, సది పాల్గొన్నారు.

అంబట్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవం

హాజరుకాని అధికారులు

చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం డిమాండ్

మహదేవపూర్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉన్న అసమానతలు తొలగించేందుకు, అంటరానితనం రూపుమాపేందుకు చేపట్టే పౌరహక్కుల దినోత్సవాన్ని శుక్రవారం అంబట్ పల్లిలో నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ప్రహ్లాద్ మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. గ్రామంలో షెడ్యూల్ కులాల ప్రజలపై వివక్ష, అంటరానితనం చూపిస్తే తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యల గురించి వివరించారు. వివిధ శాఖల మండలాధికారులు ఈకార్యక్రమానికి హాజరు కావాల్సి ఉండగా వ్యవసాయ, అటవీ శాఖల తదితర శాఖల నుంచి అధికారులు పాల్గొనలేదు. దీనిపై అంబేద్కర్ సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి హాజరుకాని సంబధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, కార్యదర్శి రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు మేరుగు లక్ష్మణ్, లింగాల రామయ్య, పత్తి మల్లేష్ పాల్గొన్నారు.



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహసీల్దార్

జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకం ̄ంగాన్ని అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, దేవాదాయ, ఆర్కియాలజీ మ్యూజియం, విద్యా, ఇరిగేషన్, పర్యాటక, సమాచార, యువజన సర్వీసుల, మైనారిటీ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక శాఖ ద్వారా మంజూరైన నిధులను సమర్థగా వినియోగిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. గణపురం, పాండవులగుట్ట వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించాలన్నారు. మేలో జరుగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం, మైలారం ప్రాంతంలోని అభివృద్ధి పనులకు అటవీ శాఖ భాగస్వామ్యంపై కలెక్టర్ సమీక్షించారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఉమ్మడి పర్యాటక శాఖ అధికారి శివాజీ, సహాయ పర్యాటక శాఖ అధికారి సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

మల్హర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ సభ్యులు కుక్కుడపు వెంకటేశ్వర్లు, రేపాల హరీష్, ఒల్లాల వరప్రసాద్, గర్రెపల్లి రమేష్, ఒల్లాల రమేష్, కుక్కుడపు అశోక్, యెల్లూరి శ్రీనివాస్, కుక్కుడపు సత్యనారాయణ, ఒల్లాల నాగరాజు, యాంసాని రవిచంద్ర, ఆలయ అర్చకులు ప్రహ్లాద్ శర్మ, రేపాల శరత్ తదితరులు పాల్గొన్నారు.

చల్లగరిగలో జంతు సంరక్షణపై అవగాహన

చిట్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చల్లగరిగ ప్రాథమిక పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం జంతు సంరక్షణ ర్యాలీ నిర్వహించారు. జంతు సంరక్షణ, ఆపదలో ఉన్న జంతువులకు సహాయంపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వెటర్నరీ డాక్టర్ అప్పని అజయ్ అవగాహన కల్పించారు. అనం తరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చి, బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్య క్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, వైద్య సిబ్బంది సుజాత, కర్ణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చల్లగరిగలో జంతు సంరక్షణ ర్యాలీ

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన అధికారులు

కాటారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న శుక్రవారం సందర్శించారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గ టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన 273, 498 పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. ర్యాంప్, విద్యుత్, ఫ్యాన్లు, తాగు నీరు, టాయిలెట్స్ సౌకర్యాలపై ఆరా తీశారు. వారి వెంట పాఠశాల హెచ్ఎం ఉమారాణి, జీపీల కార్యదర్శులు సమీర్‌ఖాన్, కరుణాకర్, శ్రీనివాస్, ఉమాదేవి, కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

మంగపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, వైద్య సిబ్బందితో ర్యాలీని నిర్వహించారు. చుంచుపల్లి గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి యమున, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

వాజేడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో భౌతిక రసాయన శాస్త్ర పరీక్షలో బహుమతులు పొందిన విద్యార్థులను ఎంఈవో శుక్రవారం అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. నిత్యజీవితంలో సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందరావు, స్వరూప్‌సింగ్, ఆనంద్, రవి, కుమార్‌బాబు, రాజేష్, రోజారాణి, నాగలక్ష్మి, వెంకటేశ్వరరావు, నర్సింగరావు, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్'తో నూతన ఆవిష్కరణలు

ములుగు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ (వైఎఫ్ఎస్ఐ) ద్వారా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మల్లేశం అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో వైఎఫ్ఎస్ఐ కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్పష్టమైన గమ్యం, కలలను కార్యరూ పంలోకి తీసుకురావడంలో లక్ష్యాలు కీలకపాత్ర పోషిస్తాయని, ఒక గొప్ప భవిష్య త్తును ఊహించి దానికి దారితీసేమార్గాన్ని గుర్తించడం, ఇది నాయకత్వంలో కీలకమైన అంశమని అన్నారు. కొత్త ఆలోచనలతో వ్యాపారం ప్రారంభించి సవా ళ్లను ఎదుర్కొంటూ విజయం సాధించే వ్యక్తికి సృజనాత్మకత, ధైర్యం, ప్రతిభ వంటి లక్షణాలు ఉంటాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అకాడమి కోఆర్డినేటర్ భాస్కర్, అధ్యాపకులు కవిత, శిరీష, రాధిక, ఉదయశ్రీ, విజిత, సోమన్న, తేజోలత, టి.శ్రీను, అనిత, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో వివరాలు నమోదు చేయాలి

కన్నాయిగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో గర్భిణులు, బాలింతలు, 0.6 సంవత్సరాలలోపు పిల్లల వివరాలను రిజిస్టర్ చేయాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత అన్నారు. మండలంలోని తుపాకులగూడెం- 1 అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో శారీర, మేధోశక్తిని పెంచాలని, అక్షరాస్యత, భాషా పరిజ్ఞానం, సృజనాత్మకతను వృద్ధి చేయాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఫిజికల్‌సైన్స్ టాలెంట్ టెస్ట్

కాటారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఫిజికల్‌సైన్స్ ఫోరం (టీపీఎస్ఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభ పరీక్ష (సైన్స్ టాలెంట్ టెస్ట్) కాటారం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈవో శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేలా ప్రతిభా పరీక్షలు పెట్టడం అభినం దనీయమన్నారు. ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు మాట్లాడుతూ కాంపిటేటివ్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి చురుగ్గా పాల్గొనాలని, ఉపాధ్యాయు లు విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందిస్తే వారిలో శాస్త్రీయ దృక్పథం, కచ్చితత్వం పెరుగుతాయన్నారు. టీపీఎస్ఎఫ్ మండల బాధ్యులు పద్మజ, కాంప్లెక్స్ హెచ్ఎం ఉమారాణి, సైన్స్ ఉపాధ్యాయులు సమ్మయ్య, రాజబాబు, శ్రీనివాస్, సంపత్, జ్యోతి, లక్ష్మయ్య, నళిని, రాజయ్య, పరంసింగ్, మనోహర్‌రెడ్డి, మౌనిక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నాగజ్యోతి విస్తృత పర్యటన

మంగపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి శుక్రవారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, బ్రాహ్మణపల్లి, దోమేడ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కుడుముల లక్ష్మీనారాయణ, రాజుయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలను కలిశారు. వారి యోగక్షేమా లను అడిగి తెలుసుకున్నారు. దోమేడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎమ్డీ. గౌస్ సోదరుడు ఎమ్డీ. సర్దార్ (35) శుక్రవారం మృతి చెందగా శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ మండల ఆర్గనైజర్ చల్లగురుగుల తిరుపతి, మల్లూరు గుట్ట మాజీ చైర్మన్ పూజారి శ్రీనివాస్, సహకార సంఘం డైరెక్టర్ కొమరం బాబురావు, బీఆర్ఎస్ నాయకులు గుడివాడ శ్రీహరి, మేకల పుల్లయ్య, తోలేం రమేష్, కొమరం రత్తయ్య, ఎం. సాంబులు, కె.సిద్ధు, పి. సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద శ్రద్ధంజలి ఘటిస్తున్న నాగజ్యోతి